తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## తగ్గిన వేరుసెనగ పంట సాగు

రామకుప్పం, ఆగస్టు 7 ప్రభాతవార్త



మండలంలో వేరుసెనగ సాగు ఏటా తగ్గిపోతోంది. రైతులు వ్యయప్రయాసలకు లోనై పంటలు సాగు చేసినా గిట్టుబాటు ధరలు లేకపోవడంతో సాగు తగ్గుతోంది. ఖరీఫ్‌లో వర్షాధారమైన వేరుసెనగ పంటపై రైతులు మక్కువ చూపడం లేదు. వ్యవసాయ బోర్లు, బావుల్లో నీరు ఉండడంతో మిట్ట ప్రాంతాలను సైతం పంటలకు అనువుగా మార్చుతున్నారు. టమోటా, బీన్స్, బంగాళాదుంప, క్యాబేజ్, అరటి వంటి పంటలసాగుపై మక్కువ చూపుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే వేరుసెనగ పంటసాగు మరింత తగ్గే ప్రమాదం ఉంది. వ్యవసాయ అధికారులు స్పందించి మిట్టప్రాంతాల్లోనే కాక సాగు భూముల్లో సైతం పంట సాగయ్యేలా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.



షార్ నుంచి ప్రయోగించిన ఎస్ఎస్ఎల్‌వీ డీ-1 రాకెట్

### మరమగ్గాలకు 500 యూనిట్ల వరకూ

## ఉచిత విద్యుత్‌కు చర్యలు తీసుకోండి

**విద్యుత్ శాఖ మంత్రికి పర్యాటక శాఖ మంత్రి వినతి**



మంత్రి పెద్దిరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త :

మరమగ్గ, చేనేత కార్మికులకు కనీసం 500 యూనిట్ల వరకూ ప్రతి నెల ఉచిత విద్యుత్ ఇవ్వాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోరారు. ఈ మేరకు తిరుపతిలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆమె భర్త ఆర్.కె.సెల్వమణి, సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డిలతో కలిసి ఆమె మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తమిళనాడు రాష్ట్రంలో వీవర్లకు విద్యుత్ బిల్లుల్లో మినహాయింపు ఇస్తున్నారని తెలిపారు. అలాగే మరమగ్గ యూనిట్లకు వచ్చే విద్యుత్ బిల్లులను కేటగిరీ 4లోకి మార్చాలని కోరారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 2.00 లక్షల మందికి పైగా కార్మికులకు వస్త్ర రంగ పరిశ్రమ ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. కరోనా కారణంగా పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. నూలు ధరలు బాగా పెరగడం, ఉత్పత్తులు అమ్ముడు కాకపోవడం వల్ల వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అటువంటి కఠిన పరిస్థితుల్లో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నగరి నియోజకవర్గం పరిసర ప్రాంతాల్లోని మరమగ్గ వృత్తిదారులకు 20 లక్షల మీటర్ల స్కూల్ యూనిఫార్‌లు తయారు చేయడానికి ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చి ఆదుకున్నారని తెలిపారు. అలాగే నేతన్న నేస్తం పథకం కింద ప్రతి చేనేత కార్మికునికి సంవత్సరానికి 24,000 వేలు అందిస్తున్నారని తెలిపారు. దీనికి మరమగ్గ, చేనేత వృత్తిదారులు ముఖ్యమంత్రి, వైకా పాకు రుణపడి వుంటామని బహిరంగంగా సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ బిల్లులు వారి ఆర్థిక పరిస్థితిని దిగజార్చుతున్నాయన్నారు. అందువల్ల 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందించేందుకు విద్యుత్ శాఖ మంత్రి చర్యలు తీసుకుని మరమగ్గ, చేనేతరంగాన్ని ఆదుకోవాలని కోరారు.

### ఎస్ఎస్ఎల్‌వీ డీ-1 రాకెట్

## ప్రయోగం విఫలం

**సందర్శకులతో కిటకిటలాడిన షార్**



షార్ చంటిబిడ్డను కూడా నిశితంగా తనిఖీలు చేస్తున్న భద్రత సిబ్బంది




ప్రయోగ వైఫల్యం తర్వాత నిరాశగా ఇస్రో ఛైర్మన్ సోమనాథ్



మిషన్ కంట్రోల్ సెంటర్‌లో ఉత్కంఠగా రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తున్న శాస్త్రవేత్తలు

శ్రీహరికోట (తడ), ఆగస్టు 7 ప్రభాతవార్త

శ్రీహరికోటలో ఆదివారం తెల్లవారుజాము నుంచి సందర్శకులు క్రిక్కిరిసిపోయారు. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో తొలి రాకెట్‌ను ప్రయోగిస్తుండటం, ఆజాది శాట్ పేరుతో స్వాతంత్ర్య కానుకగా ఉపగ్రహాన్ని ప్రయోగిస్తుండటం వంటి కారణంతో షార్‌కు సందర్శకులను ఎక్కువగా అనుమతించారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవడంతో పాటు నేరుగా వచ్చిన సందర్శకులు కనీసం పదివేల మంది ఈ రాకెట్ ప్రయోగాన్ని వీక్షించారు. వీరితో పాటు మరో వెయ్యిమంది షార్ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు శ్రీహరికోట నుంచే రాకెట్ ప్రయోగాన్ని తిలకించారు. ఉదయం 9.18 గంటలకు ప్రయోగం జరగగా, అంతకు రెండు గంట ముందే షార్ అంతా సందర్శకులతో నిండిపోయింది. చంటి బిడ్డలను తీసుకొని మహిళలు తరలివచ్చారు. చిన్నారులను సైతం భద్రత సిబ్బంది తనిఖీలు చేశారు. అనంతరం రాకెట్ ప్రయోగాన్ని ఆనందంగా వీక్షించి తిరుగు ప్రయాణమయ్యారు. సూళ్లూరుపేట, శ్రీహరికోట మార్గం వాహనాలతో క్రిక్కిరిసిపోయింది. మధ్యాహ్నంపైన కూడా పులికాట్‌సరస్సులోని పలుచోట్ల విదేశీ పక్షులనుచూడటం కనిపించింది.





రాకెట్ గమనాన్ని వీక్షించడానికి వచ్చిన మహిళలు

### ప్రయోగ వైఫల్యంతో నిరాశ

శ్రీహరికోట నుంచి ఇటీవల వరుస విజయాలు సాధిస్తున్నప్పటికీ ఆదివారం ఎస్ఎస్ఎల్‌వీ డీ-1 వైఫల్యం అటు శాస్త్రవేత్తల్లోనూ, ఇటు స్థానికుల్లోనూ నిరాశ తీసుకొచ్చింది. బుల్లి రాకెట్ కావడంతో అలవోకగా అంతరిక్షంలోకి చేరుతుందని నమ్మారు. అయితే ఆఖరు దశలో ఇది వైఫల్యం చెందినట్లు తెలుసుకొని డీలా పడ్డారు. శ్రీహరికోట నుంచి ఎస్ఎస్ఎల్‌వీ డీ-1 రాకెట్ ప్రయోగం సక్సెస్ అయి ఉంటే ఇటువంటి రాకెట్లు మళ్లీ మళ్లీ ప్రయోగించే వారని, విదేశీ డాలర్ల పంట పండించే క్షేత్రంగా అభివృద్ధి చెంది ఉండేదని స్థానికులు నమ్ముతున్నారు. ఇదిలావుంటే రాకెట్ ప్రయోగ వీక్షణకు ఇస్రోలోని వివిధ విభాగాల డైరెక్టర్లతో పాటు మాజీ ఛైర్మన్లు శివన్, రాధాకృష్ణన్, కిరణ్‌కుమార్ తదితరులు విచ్చేశారు.

### మొదటి గండం తప్పలేదు

శ్రీహరికోట నుంచి ఎన్ని రాకెట్లు ప్రయోగించినప్పటికీ ఉపగ్రహ వాహక నౌకలు ప్రయోగించేటప్పుడు ఒక్కో సిరీస్‌లో తొలి ప్రయోగాలు శాస్త్రవేత్తలను ఇబ్బంది పెడుతున్నాయి. భారత్ స్వయంగా రాకెట్లు తయారు చేసి మన ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేవపెట్టడం ప్రారంభించిన తర్వాత మొదటి సిరీస్ ఎస్ఎల్‌వీ-3తో మొదలైంది. ఆ సిరీస్‌లో మొదటి ప్రయోగం 1979 ఆగస్టు 10న జరగ్గా అది విఫలమైంది. అనంతరం ఎఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఎఎస్ఎల్‌వీ డీ-1 రాకెట్‌ను 1987 మార్చి 24న ప్రయోగించగా, అది కూడా విఫలమైంది. అనంతరం పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో పీఎస్ఎల్‌వీ డీ-1 రాకెట్‌ను 1993 ఫిబ్రవరి 20న ప్రయోగించగా, అది మూడో దశలోనే వైఫల్యం చెందింది. ఆ తర్వాత జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో జీఎస్ఎల్‌వీ డీ-1 పేరుతో 2001 ఏప్రిల్ 18న రాకెట్‌ను ప్రయోగించడానికి అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ చివరి క్షణంలో స్ట్రాపాన్ల మొరాయింపుతో నిలిచిపోయింది. అనంతరం ఈ సమస్యను అబ్దుల్ కలామ్ సహకారంతో శాస్త్రవేత్తలు అధిగమించి మరోసారి ఈ రాకెట్‌ను ప్రయోగించారు. జీఎస్ఎల్‌వీ మార్క్3 సిరీస్‌తో మొదటి ప్రయోగం 2014 డిసెంబర్ 18న జరగ్గా, అది విజయవంతమైంది. అయితే మార్క్3 ప్రయోగానికి కనీసం ఆరేళ్ల పాటు ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని శాస్త్రవేత్తలు ఎట్టకేలకు విజయం సాధించారు. శ్రీహరికోట నుంచి ఇటీవల 2017 ఆగస్టు 31న పీఎస్ఎల్‌వీ సీ-39 రాకెట్, 2021 ఆగస్టు 12న జీఎస్ఎల్‌వీ ఎఫ్10 రాకెట్‌లు ప్రయోగించగా వైఫల్యం చెందాయి. మళ్లీ ఆగస్టు నెలలోనే ఆదివారం ప్రయోగించిన ఎస్ఎస్ఎల్‌వీ సిరీస్‌లోని తొలి రాకెట్ ఎస్ఎస్ఎల్‌వీ డీ-1 విఫలం చెందింది. కొన్ని రాజకీయ పార్టీలకు లాగానే రాకెట్ కేంద్రానికి కూడా ఆగస్టు ముప్పు తప్పలేదని కొందరు వ్యాఖ్యానించారు.

## మురిసిన మువ్వెన్నల జెండా

**- చిత్తూరులో దేశభక్తి రగిలించేలా ఆజాదీకా అమృత్ ఉత్సవ్**



చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త:

ఆజాదీకా అమృత్ ఉత్సవ్‌లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రం చిత్తూరులో మువ్వెన్నల త్రివర్ణ ప్రతాకం మురిసింది. చిత్తూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ ఉత్సవ్‌లో భాగంగా మున్సిపల్ ఉద్యోగులు, ప్రజలు, విద్యార్థులు మువెన్నల జెండాను చేతపట్టి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు గాంధీ విగ్రహం కూడలలో ఈ ర్యాలీని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించగా ఈ కార్యక్రమంలో మేయర్ అముద, కమీషనర్ డాక్టర్ జె.అరుణ, డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డిలు, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం, టౌన్ బ్యాంకు ఛైర్మన్ రామ్‌గణేష్, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం నాడు ఎంతో మంది మహానుభావులు తమ ప్రాణాలను అర్పించారని వారందరిని ఈ సందర్భంగా మననం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వారిని స్మరించుకొని వారి అడుగుజాడల్లో నడచి దేశంను మరింత ముందుకు తీసుకెళ్ళాలని పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆజాదీగా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంను నగర పరిధిలో భారీ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహనీయుల ఆదర్శాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందడుగు వేయాలన్నారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి నింపేలా మువ్వెన్నల జెండాలతో ర్యాలీలు, ఇతర కార్యక్రమాలను భారీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, వార్డు కార్యదర్శులు, వాలంటీర్లు, ఆర్పీలు, పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధీటైన నాయకుడికే అవకాశం!

### సమర్థులైన పార్టీ విధేయుల కోసం "సెర్చింగ్"!

ప్రభాతవార్త-తిరుపతి:



తొలినుంచి తిరుపతి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి ,ఇక్కడ నాయకుల, పార్టీశ్రేణుల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్న తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు గట్టినాయకత్వం కోసం అన్వేషణ ప్రారంభించినట్లు తెలుస్తోంది. పార్టీ ఆవిర్భావం నుంచి మొన్నటి వరకు తిరుపతి నియోజకవర్గంలో తెలుగుదేశంకు మంచి ప్రాబల్యం,అభిమానులు, ఓటర్లు బలంగా ఉన్నారు. ఇక్కడ అనేక ఎన్నికల్లో ఎక్కువసార్లు తెలుగుదేశమే గెలిచింది. 2019 ఎన్నికల్లో కూడా తిరుపతి నుంచి టిడిపి టిక్కెట్ అందుకుని అభ్యర్థిగా పోటీచేసిన సుగుణమ్మ కేవలం 708 ఓట్లతేడాతో వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి(ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే)భూమన కరుణాకర్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. అయితే ఇక్కడ టిడిపి కార్యకర్తలు,కేడర్ ఓటర్లు బలంగా ఉన్నప్పటికీ పార్టీలోని నేతల పనితీరుపై ఎవరికివారే అన్నచందంగా తయారయ్యారనేది అధిష్టానం అంచనావేసింది. అంతేగాక నూతన జిల్లాగా ఏర్పాటైన తరువాత తిరుపతి నియోజకవర్గం నుంచే పార్టీని ప్రక్షాళన చేసి రానున్న ఎన్నికల్లో మళ్ళీ తమ పార్టీ సత్తాచూపాలనే బలమైన లక్ష్యంతో అధినేత చంద్రబాబు ముందుకు కదులుతున్నారు. అదే సమయంలో పార్టీనేతలు కూడా తనను పాలోఅవ్వాలనేది ఆయన నిర్ణయించుకున్నారు. ఇప్పటికే తిరుపతిలో జరిగిన నగరపాలకసంస్థ తొలి ఎన్నికల్లో పార్టీ ఘోరంగా ఓడిపోవడం, కనీసం డివిజన్లలో గట్టి అభ్యర్థులను పోటీకి నిలబెట్టకపోవడం, ఇటీవల ముగిసిన తిరుపతి టౌన్‌బ్యాంకు పాలకమండలి ఎన్నికలను పార్టీ కేడర్ ఆషామాషీగా తీసుకోవడం వంటివి ఇప్పుడు చంద్రబాబును తీవ్రంగా కలచివేస్తున్నాయి. తిరుపతిలో టిడిపి పరిస్థితి దిగజారిపోతోందనే ఆందోళన పార్టీ శ్రేణుల్లో మొదలైంది. అంతేగాక తన సొంత గ్రామానికి ,చదువుకున్న చోట పార్టీని నిలబెట్టుకోవాలనే తపనతో బాబు వ్యూహం రచిస్తున్నట్లు ఆ పార్టీ శ్రేణుల్లో వినిపిస్తున్న వ్యాఖ్యలు. ఈ సమయంలో తిరుపతి నియోజకవర్గంపై రానున్న రోజుల్లో స్వయంగా చంద్రబాబు సెర్చ్‌ఆపరేషన్ చేసి, పార్టీకి ప్రాణంపోసే ధీటైన నాయకుడు కోసం క్షేత్రస్థాయిలో కార్యకర్తల నుంచి అభిప్రాయాలు తీసుకునే దిశగా పథకం రచిస్తున్నాడు. అధికారపార్టీతో వంతపాడేవారుగాక ధీటుగా ఎదుర్కొనే నాయకుడు కోసం బాబు సిద్ధమైపోయారనేది తెలుస్తోంది. పార్టీలో కార్యకర్తల నుంచి కేడర్ ఉన్న శ్రేణులను కలుపుకుని పనిచేసే వారికే పగ్గాలు అప్పగించేందుకు చంద్రబాబు నిర్ణయించేశారనేది తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిని తప్పించి ఆ స్థానంలో రెడ్డి వర్గానికి బాధ్యతలు అప్పగించే యోచనతో పార్టీ వర్గాలు ఆలోచన చేస్తున్నాయి. ఇందుకు సూరాసుధాకర్‌రెడ్డి పేరు పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఆయన విద్యార్థి దశనుంచి చంద్రబాబుతో సన్నిహితంగా ఉండటం, శ్రీకాళహస్తి, తిరుపతి నియోజకవర్గాల్లో మంచి పేరుండటం ,ఆర్థికబలం,అనుభవంతో బాటు అందరినీ కలుపుకెళ్ళే తత్త్వం ఉండటం ఆయనకు అదనపు అవకాశంగా మారనుంది. అలాగే అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీలో ఉన్న జెబి శ్రీనివాస్, మబ్బు దేవనారాయణరెడ్డి, మోహన్ వర్గీయులతో కూడా కలసిపోతారనేది చర్చఉంది. మరి ధీటైన వారెవరనేది చంద్రబాబు కొద్దిరోజుల్లో తేల్చేయనున్నారు.


### టెట్ పరీక్షకు 784 మంది అభ్యర్థులు గైర్హాజరు

చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త:

టెట్-2022 రాత పరీక్షలకు ఆదివారం 784 మంది అభ్యర్థులు గైర్హాజరు అయ్యారు. జిల్లాకు సంబంధించి టెట్ రాత పరీక్షలు చిత్తూరు 3, పుత్తూరు 2, పూతలపట్టు 1, చెన్నైలో 5 పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం జరిగిన సెషన్-1 పరీక్షకు 64 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సివుండగా 59 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెషన్-2 పరీక్షకు 1,747 మంది అభ్యర్థులు హాజరు కావాల్సివుండగా 968 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సెషన్-2కు 779 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

### ఉష్ణోగ్రతలు

7/8/2022



- తిరుపతి 30 డిగ్రీలు
- చిత్తూరు 32 డిగ్రీలు
- మదనపల్లి 27 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 32 డిగ్రీలు
- వెంకటగిరి 33 డిగ్రీలు
- గూడూరు 33 డిగ్రీలు

### బంగారం ధరలు

7/8/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,846

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,285

### కోడిగ్రుడ్ల ధరలు

7/8/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00

1 డజను: రూ.60.00

## శివయ్య సన్నిధికి ఆషాఢం షాక్

### తగ్గిన భక్తులు: వచ్చిన వారికి సుదర్శనం



శ్రీకాళహస్తి,ఆగస్టు 7 ప్రభాతవార్త

ఎప్పుడూ రద్దీగా ఉండే శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆషాడం షాక్ తగిలింది. గత 15 రోజులుగా ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. నిత్యం కనీసం 20 నుంచి 25వవేల వరకు వచ్చే భక్తులు 15రోజులుగా 15వేలు దాటటం లేదు.దాంతో ఆలయం భక్తుల్లేకుండా వెల వెల బోతుంది. అయితే వచ్చిన వారికి సుదర్శనం సత్వర దర్శన భాగ్యం లభిస్తుంది. స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వరుని నిజరూప దర్శనం చేసుకుంటున్నారు. ఆలయానికి భక్తుల్లేక పోవటంతో పట్టణంలోని నాలుగు మాడావీధుల్లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు,వ్యాపారసంస్థలు జనం లేక బిక్కుబిక్కుమంటున్నాయి. ఇక ఆలయానికి పూజా సామగ్రి విక్రయించే ప్లాట్ దుకాణాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. భక్తులు ఇలా తగ్గటానికి కారణం 'ఆషాఢ మాసం కావడంతో' తమిళనాడు,కర్నాటక, రాష్ట్రం, తెలంగాణ నుంచి భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది.

**తగ్గిన రాహుకేతుదోష నివారణ పూజలు:**

సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు ఎక్కువ మంది కాలసర్పదోష నివారణ పూజలు, రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకుంటారు. అయితే గత 15రోజులుగా ఈ పూజలు చేయించుకునే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సాధారణంగా ఆదివారం కనీసం 6వేల పూజలు జరిగేవి.అలాంటిది ఆదివారం మూడున్నర వేలు దాటలేదు.సాయంత్రం వరకు అందించిన సమాచారం మేరకు 17373 మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శన టిక్కెట్లు రూ.200 టిక్కెట్లు 398 రూ.50ల టిక్కెట్లు 1513లు రాహుకేతుదోష నివారణ పూజల టిక్కెట్లు రూ.500లవి 2138 రూ.750ల టిక్కెట్లు 817,రూ.1500ల టిక్కెట్లు 2320, రూ.2500ల టిక్కెట్లు 234, రూ.5వేల టిక్కెట్లు 58లు కొనుగోలు చేసి పూజలు జరుపుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. ఆలయంలో అభిషేకాలు 66, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 25 శనీశ్వరాభిషేకాలు 65 జరిగినట్లు ప్రకటించారు.



పుత్తూరులో వెలసిన శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి తిరుణాళ్లు సందర్భంగా ఆదివారం కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న ద్రౌపదీదేవి

# భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం





పుత్తూరురూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలో వెలసిన శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజులస్వామి తిరుణాళ్ల సందర్భంగా అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని భక్తిప్రవర్తలతో నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి, అమ్మవారికి విశేష అభిషేకాలు చేసి కల్పవృక్ష వాహనంపై ఊరేగించారు. ఉభయ దాతగా పుత్తూరుకు చెందిన విరాట్ విశ్వ బ్రాహ్మణ సంఘం స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులు కంకణం కట్టుకుని వేప మండ చేత పట్టుకుని ఏడు బావుల్లో స్నానమాచరించారు. అనంతరం కార్వేటినగరం రోడ్డులోని మంచినీళ్ళ గుంటలో స్నానమాచరించి పసుపు బట్టలు ధరించుకుని అగ్నిగుండ ప్రవేశానికి వెళ్లారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో ముందుగా అమ్మవారిని అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణ కార్యక్రమాన్ని చేశారు. అనంతరం భక్తులు అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతగా ఈశ్వరాపురం గ్రామానికి చెందిన పుత్తూరు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, ప్రముఖ శల్య వైద్యులు సురపురాజు, ప్రతాప్‌రాజు, కీర్తిశేషులు సుబ్రహ్మణ్యంరాజు, ఈశ్వరాపురం క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో, అలాగే పుత్తూరు డిపోకు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో రాత్రి సూర్య ప్రభ వాహనంపై శ్రీ ద్రౌపదీదేవి ధర్మరాజు స్వామిని మంగళ వాయిద్యాల నడుమ విద్యుత్ అలంకరణలతో పురవీధుల్లో ఊరేగించారు. వేలాది మంది ఈ అగ్నిగుండ ప్రవేశానికి హాజరయ్యారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి నైవేద్యంగా అమ్మవారికి సమర్పించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, పోలీసుశాఖ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్కౌట్‌అండ్‌గైడ్స్ పర్యవేక్షణలో చర్యలు చేపట్టారు.

న నేడు ఆలయంలో...

పుత్తూరు పట్టణంలో ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజులస్వామి తిరుణాల సందర్భంగా సోమవారం ఆలయంలో ఉదయం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం అగ్నిగుండం శాంతి పూజ ఉత్సవం అనంతరం అమ్మవారి వసంతోత్సవం, రాత్రి 9 గంటలకు ధ్వజారోహణతో తిరుణాళ్ల ముగింపు అవుతుందని ఆలయ చైర్మన్ లారీ మోహన్, కమిటీ సభ్యులు తెలిపారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కుప్పంరూరల్ /శాంతిపురం, ఆగస్టు 7 ప్రభాతవార్త



కుప్పం, శాంతిపురంలలో ఆదివారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు చేపట్టారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినాన ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమాల్లో కుప్పం ఎంపిడిఒ విజయ్‌దత్, ఎంఇఒ మహబూబ్ బాషా, శాంతిపురం ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, జడ్పీటిసి శ్రీనివాసులు, మండల కన్వీనర్ దండపాణి, తహశీల్దార్ లోకేశ్వరరావు, ఎంపిడిఒ హేమమాలిని, నంజుండరావు, రాధాకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, మధు,రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## త్రివర్ణ పతాకం దేశానికి గర్వకారణం

### - ద్రవిడ వర్సిటీ విసి ఆచార్య తుమ్మల రామకృష్ణ

కుప్పం, ఆగస్టు 7 ప్రభాతవార్త



త్రివర్ణ పతాకం దేశానికి గర్వకారణమని అందుకే ప్రతి భారతీయుడు స్వాతంత్ర్య దినోత్సవ వేళ జెండా ఎగురవేస్తారని ద్రవిడ వర్సిటీ విసి ఆచార్య తుమ్మల రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ద్రవిడ వర్సిటీలో ర్యాలీ నిర్వహించారు. హర్ ఘర్ తిరంగ పేరిట ప్రభుత్వం జాతి సమైక్యత చాటేలా శ్రీకారం చుట్టిందని ఆయన పేర్కొన్నారు. ప్రతి పౌరుడు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య అక్కుటర్‌బాబు, డా॥ యశోద, డా॥ శ్రీకుమార్, ఆచార్య కరీముల్లా, బోధన, బోధనేతరసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సత్వరం కౌన్సెలింగ్ నిలుపుదల

### - ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు శివయ్య

చిత్తూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త:

వైద్య ఆరోగ్యశాఖలో హేతుబద్ధీకరణలో భాగంగా ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎఎన్‌ఎంలను బదిలీ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఈ ఉత్తర్వుల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సోమవారం నుండి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించడానికి సిద్ధమైందని ఈ కౌన్సెలింగ్‌ను సత్వరం నిలుపుదల చేయాలని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు శివయ్య డిమాండ్ చేశారు. ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీరెడ్డి, తాలుకా అధ్యక్షుడు ఫిలిప్‌కుమార్, కార్యదర్శి హరిప్రసాద్‌రెడ్డి, కోశాధికారి పార్థిబన్ తదితరులతో కలిసి జిల్లా అధ్యక్షుడు శివయ్య విలేకరులతో మాట్లాడుతూ ఎఎన్‌ఎంలు గత కొన్ని సంవత్సరాలుగా సబ్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్నారని అయితే కొత్తగా గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తించాలని ఉత్తర్వులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారన్నారు. సబ్ సెంటర్ల నుండి తమను బదిలీ చేస్తే తాము సీనియార్టీ కోల్పోతామని అలాగే సంవత్సరం మధ్యలో బదిలీ చేస్తే దూర ప్రాంతాలకు వెళ్ళి ఎలా విధులు నిర్వర్తించాలని అడుగుతున్నారన్నారు. జిల్లా అధికారులు రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్ళి బదిలీల కౌన్సెలింగ్‌ను నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## జవహర్‌బాషా హత్యకేసులో ముద్దాయిలు అరెస్టు

చిల్లకూరు ఆగస్టు 7 ప్రభాతవార్త



జవహర్‌బాషా హత్యకేసుకు సంబంధించి ఇద్దరిని అరెస్టు చేసినట్లు గూడూరు డిఎస్‌పి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చిల్లకూరు పోలీస్‌స్టేషన్ ఆవరణంలో డిఎస్‌పి ఆధ్వర్యంలో ఆదివారం జవహర్‌బాషా హత్యకేసుకు సంబంధించి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిల్లకూరు వడ్డిపాళెంలో ఆటో తోలుకొని జీవనం సాగిస్తున్న జవహర్‌బాషా జులై 15వ తేది ఇంటి నుండి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గూడూరు సిఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డిలు మిసింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా జులై 29వ తేది గూడూరు మండలం ఇందూరు కండ్రిగ వద్ద కైవల్యానదిలో శవమై కనిపించాడు.స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడిని పరిశీలించగా ఆధార్‌కార్డు ఆధారంతో జవహర్‌బాషాగా గుర్తించారు.అప్పటి నుండి డిఎస్‌పి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. గూడూరు మండలం అయ్యవారిపాళెం అరుంధతీవాడకు చెందిన దర్శిగుంట బాబు. తుమ్మూరు గౌతమ్ ఇద్దర్ని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. గత నెల రోజుల నుండి జవహర్‌బాషాను హతమార్చాలని అతని వద్ద 8 ఉంగరాలు తీసుకుంటే ఎ-1 ముద్దాయి అయిన దర్శిగుంట బాబు అప్పులు తీరిపోతాయన్న ఉద్దేశంతో ఈ హత్య చేయడం జరిగిందని దర్యాప్తులో తేలిందన్నారు. వారి వద్ద నుండి 8 ఉంగరాలు,రెండు సెల్‌ఫోన్లు, రెండుచాకులు స్వాధీనం చేసుకొని ముద్దాయిలను కోర్టుకు హాజరు పరచడం జరిగిందని అన్నారు.ఈ కేసును చాకచక్యంగా చేదించిన సిఐ శ్రీనివాసులురెడ్డిని,ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డిలతోపాటు ఆర్‌విరాజు, రహీమ్, సుబ్రమణ్యం,వెంకటేశ్వర్లుతోపాటు విష్ణుని డిఎస్‌పి అభినందించారు.



చౌడేపల్లి పట్టణంలోని నేతాజీనగర్‌లోని లహరి పెరట్లో చెట్టువుంది. ఆచెట్టు నిండా పుష్పాలు పూశాయి. మొక్కలోని ఆకు నుంచి మాత్రమే పూసే ఈ పుష్పాలు హిమాలయాల్లో పూస్తాయ నీ, బ్రహ్మదేవుడు వీటిని ఆసనంగా కల్గివుండటం వల్ల బ్రమ్మకమలాలంటారని పండితులు అంటున్నారు.

ప్రభాతవార్త, చౌడేపల్లి

## ఒంగోలు ఎంపీని కలిసిన పేర్నాటి



కోట, ఆగస్టు 7 ప్రభాతవార్త

ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఒంగోలులోని ఆయన నివాసంలో తూర్పు రాయలసీమ వైసీపీ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని ప్రకాశం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలతో సమన్వయ పరుచు కుంటూ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని శ్రీనివాసులురెడ్డి చెప్పినట్లు శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

## క్రీస్తుమార్గం శాంతిమార్గం...ఎమ్మెల్యే బియ్యపుమధుసూదన్‌రెడ్డి



రేణిగుంట ఆగస్టు 7 ప్రభాతవార్త

ఏసుక్రీస్తు అవలంబించిన మార్గం శాంతిమార్గమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపుమధుసూదన్‌రెడ్డి అన్నారు. రేణిగుంట జెరుసలెం అపోస్తలిక్ చర్చి 31వవార్షికోత్సవ సందర్భంగా ఆదివారం ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే బియ్యపుమధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఏసుక్రీస్తు శాంతిప్రేమికుడన్నారు. ఆయన మార్గాన్ని అవలంబిస్తే ప్రపంచం శాంతిమయంగా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రేణిగుంట సర్పంచ్ నగేషం, పట్టణవైకాపా అధ్యక్షుడు ప్రభాకర్, ఉపసర్పంచ్ ఇర్ఫాన్, యంపీటీసీ మూర్తి, వైకాపానేతలు వేణు, సుబ్రమణ్యం, బిషప్ రాజబాబు, పాస్టర్ రెడ్డి, క్రైస్తవ క్రీస్తుప్రేమికులు ఏసుపాదం, ఏసురత్నం, పాస్టర్ డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రేక్షకులను అలరించిన బకాసుర వధ

### ఎన్‌ఆర్ కమ్మపల్లిలో వైభవంగా మహాభారత ఉత్సవాలు

రామచంద్రాపురం, ఆగస్టు 7 ప్రభాతవార్త:



ఎన్‌ఆర్ కమ్మపల్లిలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం బకాసుర వధ హరికథ ప్రేక్షకులను అలరించింది. ఎన్‌ఆర్ కమ్మపల్లిలో మహాభారత ఉత్సవాలను గ్రామస్థులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 4వ రోజున బాగవతారిణి మునిలక్ష్మి బకాసురుడి వధ హరికథ కన్నులకు కట్టినట్లు వివరించారు. అదేవిధంగా నాటకంలో బకాసురుడి వధకు భీమసేనుడు గ్రామంలో ఇంటింటి నుండి వివిధ రకాల పిండివంటలతో కూడిన కుంబాన్ని సేకరించి బండిలో తరలించే సన్నివేశం పండుగ వాతావరణంలో నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర నాట్య కళా మండలి ఆధ్వర్యంలో రాత్రి బకాసురుడి వధ నాటకంలో యుద్ధ సన్నివేశం ఆహుతులను ఆకట్టుకున్నది. ఉత్సవాలలో అమ్మవారి పూజాధి కార్యక్రమా లను హరి ఆచ్చారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## నగరంలో ఆజాదికా అమృత్ మహోత్సవ అవగాహన ర్యాలీ



చిత్తూరురూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :

నగరంలో పివికెయన్ కళాశాల విద్యార్థులు ఆదివారం కళాశాల నుంచి దుర్గమ్మగుడి, గిరింపేట, జిల్లాపరిషత్ కార్యాలయం మీదుగా గాంధీ సర్కిల్ వరకు కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డా.మోహన్‌బెహరా, ఎస్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డా.భానుప్రకాష్ ఆధ్వర్యంలో ఆజాదికా అమృత్ మహోత్సవ ర్యాలీని జాతీయ దేశనాయకుల వేషధారణలలో వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.ఆనందరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల త్యాగాలు,పోరాట ఫలాలు నేటి తరానికి అర్థమయ్యేలా, దేశభక్తిని ద్విగుణీకృతం చేసేలా తమ కళాశాల నందు ఆగస్టు 1నుంచి 15వ తేదివరకు వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా,రామమూర్తి,రమేష్, హరిబాబు, ఇస్మాయిల్, గోపినాయక్, డా.బెనజీర్, పద్మావతి ఇతర అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరామలింగ చాముండేశ్వరి అమ్మవారికి విగ్రహ ప్రతిష్ఠ



కోట, ఆగస్టు 7 ప్రభాతవార్త

కోట మండలం గూడలి గ్రామంలో శ్రీరామలింగ శ్రీచాముండేశ్వరి అమ్మవారి పున: నూతన విగ్రహ ప్రతిష్ఠాపన, విమాన శిఖరములు, విఘ్నేశ్వరస్వామి, శ్రీసుబ్రహ్మణ్యస్వామి సింహవాహనం, బలిపీఠం, దేవతలకు ప్రతిష్ఠాపన మహా కుంభాభిషేకాలు భక్తుల మధ్య వైభవంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తులను పరవశింపచేశాయి. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 500 సంవత్సరాలకు పూర్వం నిర్మించిన చాముండేశ్వరి ఆలయం ఇరుకుగా ఉండటంతో ప్రస్తుతం భక్తులు పెరిగిన నేపథ్యంలో ఆలయ ధర్మకర్త ఆశం శ్రీనివాసులు దాతృత్వంతో పున:ప్రతిష్ఠింపచేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, బాణా సంచా వేడుకల మధ్య గ్రామోత్సవం కొనసాగింది.

## లింగాల చెరువును పరిశీలించిన వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 7 ప్రభాతవార్త :

వినాయక చవితిని పురస్కరించుకుని వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు ఆదివారం వినాయక సాగర్ లింగాల అమ్మ చెరువును పరిశీలించారు. నిమజ్జన కోసం అక్కడ కావాల్సిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డితో మాట్లాడి తగు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో కమిటీ సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, గుండాల గోపినాథ్‌రెడ్డి, ఆనంద్, వెంకటేష్, నవీన్, సుబ్రమణ్యంరెడ్డి, ఆర్.సి మునికృష్ణ, సంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

## కన్నుల పండువగా ద్రౌపదీ కళ్యాణం

తిరుపతిరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:





దుర్గసముద్రం వెలసిన శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి దేవస్థానంలో శ్రీ ద్రౌపదీ కళ్యాణం ఆదివారం కన్నుల పండువుగా జరిగింది. ఉభయదాత ఆదెం వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ద్రౌపదీ కళ్యాణోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని, కళ్యాణాన్ని తిలకించారు. తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో వెలసిన శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి దేవస్థానంలో 40వ వార్షిక మహా భారత బ్రహ్మోత్సవాలు ఈనెల 4వ తేదీ నుండి 14వ తేదీ వరకు జరుగుతున్న విషయం తెల్సిందే. ఆదివారం రాత్రి ద్రౌపదీ కళ్యాణం, ఊరేగింపు నిర్వహించారు. ఈనెల 10న ఉదయం 10గంటలకు అర్జున తపస్సు, 12న సాయంత్రం 6గంటలకు శమీపూజ, 12 రాత్రి 8గంటలకు అలుగు, 13న రాత్రి గంటలకు ఇలావంతుని బలి, 14న ఉదయం 1గంటలకు దుర్యోధన వధ, 14 రాత్రి 8గంటలకు అగ్నిగుండ ప్రవేశం, 15న ఉదయం 10గంటలకు పట్టాభిషేకం, ఊరేగింపు, 15న సాయంత్రం 6గంటలకు పుష్పయాగం ఉంటుందని తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2గంటలకు తంబలపల్లి జి.వరలక్ష్మీ, భాగవతారిణి బృందంచే మహాభారత హరికథా జ్ఞాన యజ్ఞము నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, గ్రామ సర్పంచ్ మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి, జయకుమార్, ఆదెం నాగిరెడ్డి, పెద్దఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా "హర్ ఘర్ తిరంగా"

చంద్రగిరి, ఆగస్టు 7 ప్రభాతవార్త:



స్థానిక టవర్ క్లాక్ వద్ద ఆదివారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం పంచాయతీ సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా గల పంచాయతీలలో ఉద్యమ స్ఫూర్తితో హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా చంద్రగిరి మండల పరిషత్ కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ బైపాస్ రోడ్డు వరకు వెళ్ళి తిరిగి టవర్ క్లాక్ వద్దకు చేరుకున్నారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. అదేవిధంగా అగరాల పంచాయతీలోని గురుకుల పాఠశాల విద్యార్థులతో సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి భారీ ర్యాలీ నిర్వహించారు. గురుకుల పాఠశాల విద్యార్థిని భరతమాత వేషధారణలో ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో జట్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, ఉప సర్పంచ్ నగిరి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిటిసిలు అజీజా నుస్రత్ బహార్, ఈఓ మహేశ్వరయ్య, పంచాయతీ ఉద్యోగులు నాగార్జున, ఆదెమ్మ, లక్ష్మీ, శ్యామల, సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేకాహ్వానితులకు సత్కారం



శ్రీకాళహస్తి,ఆగస్టు 7 ప్రభాతవార్త

సామాజిక వర్గాల సమతౌల్యమే లక్ష్యంగా శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అడుగు లేస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలిలో అన్ని వర్గాలకు అవకాశం కల్పించలేకపోయిన శాసనసభ్యుడు తరువాత ధర్మకర్తల మండలిలో 'ప్రత్యేకాహ్వానితులు'గా అవకాశం కల్పించారు. పట్టణంలోని ప్రధాన సామాజిక వర్గాల్లో అసంతృప్తిని రూపుమాపుటకు అవకాశం కల్పించారు. ఈ నేపద్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్యవైశ్యసామాజిక వర్గానికి అత్యధిక ప్రాధన్యత కల్పించుటకు అన్ని కోణాల నుంచి పరిశీలించిన శాసనసభ్యుడు ఆ వర్గం నుంచి ప్రముఖ షరాబు వ్యాపారి జనంతో సంబంధాలు కల్గిన జూలుగంటి సుబ్బారావుకు అవకాశం కల్పించారు. కాగా మరో సామాజిక వర్గం బలిజ.ఈ సామాజిక వర్గం నుంచి ప్రజలతో సంబంధాలు కల్గిన యువనాయకుడు చింతామణి పాండుకు అవకాశంకల్పించారు. అందరితో సన్నిహిత సంబందాలు కల్గిన పాండుకు అవకాశం కల్పించి శాసనసభ్యుని పట్టణంలోని ఆ సామాజిక వర్గానికి చెందిన వారు అభినందిస్తున్నారు.

### నూతన ఆహ్వానితులకు సత్కారం:

శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించిన వారిని ఆదివారం శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ సారధ్యంలో నూతన ఆహ్వానితులకు ఘన సత్కారం ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో ఘన స్వాగతం జరిపారు. అలాగే కొత్తగా నియమించిన ప్రత్యేకాహ్వానితులకు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.ఈ కార్యక్రమాల్లోకొత్తగా నియమించిన జూలుగంటి సుబ్బారావు, ఎం.చింతామణి పవన్‌కుమార్, పి.మదన మోహన్‌రెడ్డి, కె.శోభ, పి.నీలా, ఎంపి శ్రీదేవి, కె.మీనాక్షి, బి.పవన్‌కుమార్‌లకు అభిమానులు దుశ్శాలువలతో పూల మాలలతో సత్కరించారు.

